క్లుప్తంగా

నేడు ఔషధ తనిఖీ అధికారి కార్యాలయానికి భూమిపూజ

నరసరావుపేట: స్థానిక ఎస్పీ కార్యాలయానికి ఎదురు రోడ్డులో సుమారు రూ.69లక్షల వ్యయంతో నిర్మించే ఔషధ తనిఖీ అధికారి నూతన కార్యాలయానికి శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని భూమిపూజ నిర్వహించనున్నట్లు జిల్లా ఔషధ నియంత్రణ అధికారి దత్తి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమానికి ఎంపీ లావు, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఔషధ శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

161 మందిపై బైండోవర్ కేసులు

శావల్యాపురం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండటానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. వినుకొండ రూరల్, ఈపూరు, శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలో గ్రామాల్లోని రాజకీయ పార్టీలకు చెందిన 161 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ ఈ సందర్భంగా చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలకు నిబంధనలు వివరించామన్నారు. వాటిని అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంచామన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎస్సై తుళ్లూరి తిరుపతిరావు, రైటరు శ్రీనివాసరావు ఉన్నారు.

బైకు చోరీపై కేసు నమోదు

శావల్యాపురం: గుంటుపాలెం గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదైంది. వివరాలు మేరకు.. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావుకు తన బైకు అర్ధరాత్రి చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే పిచికలపాలెం గ్రామంలో ఇటీవల ఇదే తరహాలో బైకులు చోరీకి గురైనట్లు స్థానికులు చెప్తున్నారు. పోలీసులు బైకు చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. నకరికల్లు మండలం గుళ్ళపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించి, అక్రమంగా మద్యం కలిగి ఉన్న గుత్తికొండ మీరసను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే చేజర్ల గ్రామంలో తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకి వినియోగించే 500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. తమ రాకను ముందే పసిగట్టిన నిందితులు పరారీ అయ్యారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏఎన్‌యూ హ్యాండ్‌బాల్ జట్టుకు విద్యార్థిని ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా హ్యాండ్‌బాల్ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.భాగ్యశ్రీ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు శుక్రవారం తెలిపారు. తెనాలిలోని ఏఎస్ఎన్ స్టేడియంలో ఈ నెల 4న నిర్వహించిన వర్సిటీ మహిళా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలో భాగ్యశ్రీ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ నెల 8 నుంచి చెన్నైలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో భాగ్యశ్రీ ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

పాఠశాల తనిఖీ

రొంపిచర్ల: సంతగుడిపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దారు జి.అంకారావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వీఆర్వో నాగయ్య ఉన్నారు.

అధికారులు కీలకపాత్ర పోషించాలి

- ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్
- కనమర్లపూడిలో గ్రామోదయం కార్యక్రమం
- బీసీ, ఎస్సీ కాలనీల్లో పర్యటించిన కలెక్టర్



బాలికలతో మాట్లాడుతున్న కలెక్టరు లోతేటి శివశంకర్

శావల్యాపురం: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు కీలకపాత్ర పోషించాలని పల్నాడు జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన గ్రామోదయం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. బంగారు తల్లి పథకంలో భాగంగా పాఠశాలల విద్యార్థినులను పలకరించారు. బంగారు తల్లి కార్యక్రమం నిర్వాహణ తీరును తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చొరవ చూపని ఉపాధ్యాయులకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావును కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని గ్రామస్తులు కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సత్వరమే అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. తక్షణమే కోతులను పట్టించి, ప్రత్యేక వాహనంలో అడవిలోకి తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు భారతి, డీఈఓ ఎం.శామ్యూల్, డీఎం అండ్ హెచ్ఓ బి.రవి, మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి, తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఎంపీడీఓ పేరు మీనా సీతారామయ్య, ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, ఏఓ పి.ప్రవీణ్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత తదితరులు ఉన్నారు.

వెల్లటూరులో గ్రామోదయం

బొల్లాపల్లి: మండల ప్రత్యేకాధికారి ఎస్.ఓబుల నాయుడు శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వెల్లటూరు, సరికొండపాలెం గ్రామాలను సందర్శించారు. వెల్లటూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను తనిఖీ చేశారు. బీసీ చెంచు కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని పీహెచ్‌సీని, జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. రక్త హీనత నివారణకు చేపట్టిన బంగారు తల్లి కార్యక్రమంలో భాగంగా బాలికలతో మాట్లాడారు. సరికొండపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి తగు సూచనలిచ్చారు. కాఫీవిత్ క్లాప్ మిత్ర నిర్వహించారు. క్లాప్‌మిత్ర స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓబుల నాయుడు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ బంగారుతల్లి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. బాలికల్లో రక్తహీనత నివారణకు తగు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థినుల తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వెల్లటూరు, సరికొండపాలెంలో నిర్వహించిన గ్రామోదయంలో మండల స్థాయి అధికారులు కొందరు హాజరు కాకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు ఉన్నారు.



వెల్లటూరు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఓబుల నాయుడు

వినుకొండ(నూజెండ్ల): అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బోయపాటి రవిబాబు అన్నారు. నూజెండ్ల గ్రామంలో గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగి వారిని సత్కరించారు. సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఏఈవో ఎల్.ఎలలీషా, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విన్యాసమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: మండలంలోని సాతులూరు, చిరుమామిళ్ళ, గొరిజవోలు గ్రామాల్లో శుక్రవారం అధికారులు గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. సాతులూరులో మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, చిరుమామిళ్లలో తహసీల్దారు ఎస్.నాగమల్లేశ్వరరావు, గొరిజవోలులో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కాలనీల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ ఇన్‌చార్జిలకు మార్గనిర్దేశనం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ, హెచ్ఎం హిదయతుల్లా జీఎంఎస్‌కేలు అఖిల, స్టెల్లా, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పంపిణీ

వినుకొండలో వైఎస్సార్ పింఛన్ కానుక అందజేసిన ఎమ్మెల్యే బొల్లా



పింఛను నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వైఎస్సార్ పింఛను కానుక వారోత్సవాల్లో భాగంగా స్థానిక జాషువా కళా ప్రాంగణంలో పెంచిన పింఛను నగదు రూ.3వేలను శుక్రవారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ మాటకు కట్టుబడి రూ.3వేలు పింఛను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటికే పింఛను ఇస్తున్నట్లు చెప్పారు. గతంలో కనీసం వినుకొండ పట్టణానికి తాగునీరు కూడా అందించలేని పరిస్థితుల్లో టీడీపీ ఉంటే.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, నాడు–నేడు కింద వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వినుకొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా, పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, పార్టీ నాయకులు రెడ్డి నగేష్, యారం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంపు సెట్లు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ జలకళ పథకం రైతుల పాలిట వరమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ ద్వారా వినుకొండ రూరల్ రైతులకు పంపు సెట్లు, మోటార్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రైతుల కష్టం తెలిసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో ఏటా రైతు భరోసా నగదును వేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఈద్గా స్థల పత్రాలు అందజేత

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలోని ఈద్గా స్థలాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో సర్వే చేయించి, ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయించారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో తహసీల్దారు కిరణ్‌కుమార్ సంబంధిత పత్రాలను ముస్లిం మత పెద్దలకు, కౌన్సిలర్లకు శుక్రవారం అందజేశారు. మొత్తం 2.57 ఎకరాల స్థలాన్ని రికార్డుల్లో నమోదు చేయించడంతో.. ఎమ్మెల్యేకు, తహసీల్దార్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

నాదెండ్ల: ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తలతోటి రాణి అన్నారు. గొరిజవోలులో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. సర్పంచ్ గొర్రెపాటి గృహలక్ష్మి అధ్యక్షతన నరసరావుపేటకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ అనిల్, నాదెండ్ల, గణపవరం పీహెచ్‌సీ వైద్యులు రాజేశ్వరి, ప్రసాద్ నాయక్ 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, ఎంపీటీసీ సుహాసిని, నాదెండ్ల సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, కార్యదర్శి అహమ్మద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత



నరసరావుపేట: అనారోగ్యంతో మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పమిడిపాడు గ్రామవాసి జలసూత్రపు నారాయణకు గ్రామ వలంటీరు ఎం.మల్లికార్జునరావు శుక్రవారం నూతన పింఛన్ రూ.3వేలు అందజేశారు. గ్రామస్తులు వలంటీరు సేవలను అభినందించారు.

విశ్వసనీయత చాటుకున్న సీఎం జగన్

పెంచిన పింఛను పంపిణీలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



బరంపేటలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పాదయాత్రలో చేసిన వాగ్దానం మేరకు పింఛను రూ.3వేలకు పెంచి విశ్వసనీయతను చాటుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 27, 28, 31 వార్డులకు చెందిన పింఛన్‌దార్లకు రూ.3వేలకు పెంచిన వైఎస్సార్ పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. బరంపేట ఆయా వార్డుల సచివాలయం వద్ద నాయకుడు కురుగుంట్ల కోటిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ పెరిగిన పింఛన్ స్వీకరిస్తున్న పింఛన్‌దార్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఐదేళ్లలో పింఛను నగదు రూ.3వేలకు పెంచుకుంటూ పోతానని చేసిన వాగ్దానం నెరవేర్చారన్నారు. పురపాలక పరిధిలో 2019 వరకు నెలకు 7వేల మందికి కోటి రూపాయలు పింఛన్ల రూపంలో ఇస్తే ..ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 11,500 మందికి రూ.3.40కోట్లు ప్రతి నెలా పంపిణీ చేస్తోందన్నారు. పక్షవాతం, కిడ్నీ, తలసేమియా బాధితులకు పట్టణంలో ప్రతి నెలా 190 మందికి పింఛను ఇస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్ అయితే వంచన, కుట్రలకు చంద్రబాబు కేర్ ఆఫ్ అడ్రస్సు లాంటివాడని పేర్కొన్నారు. ప్రజలకు మంచి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని తనను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, పల్నాడు జిల్లా డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, స్వచ్ఛాంధ్ర, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్.సుజాతా పాల్, స్వామి, యువజన విభాగ జోనల్ ఇన్‌చార్జి గోగుల మనోహర్, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష, న్యాయవాది కట్టా నారపరెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోగుల శంకరమ్మ, కారుమంచి మీరావలి, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం.. జగనన్న సురక్షతో సాధ్యం



యడ్లపాడు: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ అన్నారు. చెంఘీజ్‌ఖాన్ పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి రాధారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు ఎం.ప్రభాకరరావు, పి.భరద్వాజ, ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు హాజరయ్యారు. సచివాలయం పరిధిలోని సంగంగోపాలపురం, బున్నీనగర్, చెంఘీజ్‌ఖాన్‌పేట, సంతపేట, కోట ప్రాంతాలకు చెందిన 255 మంది రోగులు ఓపీ రిజిస్ట్రేషన్లు చేయించుకుని వివిధ ఆరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. వీరిలో 117 మంది మహిళలు, 138 పురుషులు, 9 మంది పిల్లలు ఉన్నారు. అయా రిపోర్టలతో వచ్చిన రోగుల్ని పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 55 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు వైద్యులు సిఫార్సు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిలకలూరిపేటటౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు, సిబ్బందికి సంపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ నల్లూరి నరసింహరావు తెలిపారు. శుక్రవారం మద్దిరాల గ్రామంలో విద్యాలయంలో చర్మవ్యాధి నిపుణలు డాక్టర్ తుంగల నాగశ్వేత, జనరల్ మెడిసిన్ డాక్టర్ జడ జతిన్ దేవ్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ మహర్షి మనోహర్, దంతవైద్య నిపుణులు డాక్టర్ నందం భువనేశ్వరి పరీక్షలు నిర్వహించారు.

రేషన్ పంపిణీ తనిఖీ

యడ్లపాడు: రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు వైవీబీ కుటుంబరావు హెచ్చరించారు. యడ్లపాడు గ్రామం 36వ రేషన్‌షాపు పరిధిలోని ఎండీయూ వాహనంలో రేషన్ సరుకుల పంపిణీని శుక్రవారం సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాధ్యతగా నిత్యావసరాలు పంపిణీ చేయాలని సూచించారు. అలాగే కారుచోల గ్రామంలో 108, 109 పోలింగ్ కేంద్రాలలో ఉన్న దివ్యాంగ ఓటర్ల నమోదు ప్రక్రియను తహసీల్దారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులకు పలు సూచలను, సలహాలు అందజేశారు. ఆర్ఐ చక్రవర్తి, వీఆర్వోలు చినకోటేశ్వరరావు, యంపరాల నాగేంద్రబాబు ఉన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడలు

నరసరావుపేట: ఆడుదాం..ఆంధ్రా క్రీడల్లో భాగంగా సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో శుక్రవారం వరవకట్టకు చెందిన విద్యార్థినులు కబడ్డీ ఆడారు. క్రికెట్, బ్యాడ్మింటన్ ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సచివాలయ అడ్మిన్లు క్రీడలను పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మల్లెల రాజేష్‌నాయుడు

యడ్లపాడు: గ్రామాల అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రతి ఒక్కరికీ చేరేలా చేయడమే తన ఏకైక లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. బోయపాలెం, ఉన్నవ గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామస్తులను కలిసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ నవరత్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరేలా అధికారులు, పార్టీ శ్రేణులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా శంకర్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, జెడ్పీటీసీలు ముక్తా వాసు, కోడె సుధారాణి, సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ, సర్పంచ్‌లు వడ్డేపల్లి నరసింహరావు, ఆర్ వేణు గోపాలరావు, ఎంపీ సుబ్బారావు, నాయకులు పంగులూరి వెంగళరాయుడు, తొట్టెంపూడి శ్రీనివాసరావు, కామినేని కోటేశ్వరరావు ఉన్నారు.

మసీదు కమిటీ సభ్యులతో సమావేశం

పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌లో ఉన్న అమీనియా మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలో సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొన్నారు. మసీదు కమిటీ పెద్దలతో సమావేశమయ్యారు. మసీదు, ఖబరస్థాన్ అభివృద్ధికి తన వంతు సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, 24వార్డు కౌన్సిలర్ షేక్ కరిముల్లా, మసీదు కమిటీ అధ్యక్షుడు జహీరుద్దీన్, కార్యదర్శి బాజాని పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు నిత్యావసరాల పంపిణీ

ఆసిస్ట్, సీడ్ సంస్థలు సంయుక్తంగా 250 మంది ఒంటరి, నిరుపేద మహిళలకు రూ. 5లక్షలు విలువైన నిత్యావసరాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పించడంతో అసిస్ట్ సంస్థ పాత్ర ఎంతో విలువైనదన్నారు. నిరుద్యోగులకు వృత్తి శిక్షణ నిర్వహించి, వృత్తి నైపుణ్యాలలో తీర్చి దిద్దుతూ ఉపాధి అవకాశాలు కల్పించటం చాలా గొప్ప పరిణామమని కొనియాడారు. అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు, ఆపరేషనల్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్, విష్ణు ప్రియ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిలకలూరిపేట: గోపాలంవారిపాలెంలోని అభయాంజనేయస్వామి 29 అడుగుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ దేవినేని శంకరరావు, పార్టీ మండలాధ్యక్షుడు గుత్తా యాములయ్య,

ప్రారంభమైన అంగన్‌వాడీ కేంద్రాలు

రొంపిచర్ల: మండల పరిధిలోని మూడు సెక్టార్లలో 16 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమయ్యాయని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం 77 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాలను కూడా యథావిధిగా కార్యకలాపాలు జరిగే విధంగా చూస్తామన్నారు. సంతగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పౌష్టికాహారాన్ని అందజేశారు. తహసీల్దార్ అంకారావు, సూపర్‌వైజర్ శశిదేవీ పాల్గొన్నారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య శుక్రవారం పంపిణీ చేశారు. మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. హెచ్ఎం వి.నరసింహారావు, పీఎంసీ చైర్మన్ నీలంసతీష్, సర్పంచ్ నాగేంద్రాబు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు వైవీఎస్ఆర్ అండ్ వైవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ వి.దేశింగరావు పాల్గొన్నారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. యన్నం రాధాకృష్ణారెడ్డి, కనకా పుల్లారెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, కొనకంచివారిపాలెం వెంకట్రావు, సుభాని, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏపీ మధుకుమార్ పాల్గొన్నారు.

వడ్లమూడివారిపాలెంలో వైద్య శిబిరం

రొంపిచర్ల: వడ్లమూడివారిపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 381 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి పర్యవేక్షించారు. డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ ఎన్. శాయిబాబు పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై కేసులు నమోదు

శావల్యాపురం: కారుమంచి గ్రామంలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై టి.తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన కిలారు సుధారాణి, కిలారు ఉమాదేవి కుటుంబ సభ్యుల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉమాదేవి తన ఇంటి ఏదుట మెట్లు ఏర్పాటు చేస్తుండగా.. సుధారాణి వాగ్వాదానికి దిగింది. ఒకరినొకరు దుర్భాషలాడుకుని, కొట్లాడుకున్నారు. తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.